క్లుప్తంగా

సీఈని కలిసిన యూనియన్ నాయకులు



ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ పి.నవీన్‌గౌతమ్‌ను వైఎస్సార్ విద్యుత్ కాంట్రాక్ట్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్-319 నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శాలువాతో సత్కరించారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్మికులు సమస్యలు ఆయనకు వివరించారు. ఎన్టీటీపీఎస్ సంస్థ అభివృద్ధికి యూనియన్ నాయకులు, కార్మికులు చిత్తశుద్ధితో సహకరించాలని సీఈ సూచించారు. యూనియన్ అధ్యక్షుడు షేక్ జానీ షరీఫ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు మందా నాగమల్లేశ్వరరావు, జంపాని ఉషా పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం



జి.కొండూరు: విజయవాడ పరిధి భవానీపురానికి చెందిన కనక నవ్యరాణి అనే పేదవిద్యార్థిని విదేశీ విద్య కోసం స్థానిక కేడీసీసీ బ్యాంకు సిబ్బంది, మండల పీఏసీఎస్ కార్యదర్శులు రూ.30 వేలు, సహకార బ్యాంకు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ రవికుమార్ రూ.20 వేలను బుధవారం అందించారు. జి.కొండూరు కేడీసీసీ బ్రాంచ్ మేనేజరు కే రమేష్ బదిలీపై వెళ్తున్న క్రమంలో ఈ సాయం అందించినట్లు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ చీఫ్ మేనేజరు సీహెచ్ స్వాతి పాల్గొన్నారు.

విద్యుత్‌లైన్ ఏర్పాటుకు చర్యలు



జి.కొండూరు: స్థానికంగా ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ లే అవుట్‌కు నూతన విద్యుత్‌లైన్ ఏర్పాటుకు బుధవారం అధికారులు చేపట్టిన పనులను ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ లబ్ధిదారులైన పేదల ఇళ్ల నిర్మాణానికి అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ మండల అరుణ, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ వేములకొండ విష్ణు పాల్గొన్నారు.

మిల్క్ యూనియన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



రెడ్డిగూడెం: కృష్ణామిల్క్ యూనియన్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. మండలంలోని కొత్తనాగులూరు, కీర్తిరాయునిగూడెం సొసైటీలను బుధవారం సందర్శించి రైతులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కొత్తనాగులూరులో ఎం.రమాదేవి కుమారుడు కల్యాణమస్తు పథకంలో భాగంగా రూ. 20వేలు విలువ గల గోల్డ్‌కాయిన్ ఇచ్చారు. పోలిశెట్టి సత్యవతి మరణించగా భర్త బసవయ్యకు క్షీరబంధు పథకం కింద రూ. 50వేల చెక్ పంపిణీ చేశారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షురాలు రామినేని దేవి ప్రవణ్య అధ్యక్షతన బుధవారం సాయంత్రం నిర్వహించారు. వివిధ శాఖ అధికారులు అయా శాఖల పరిధిలోని సంక్షేమ పథకాలు అమలును వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ దేవిప్రవణ్య మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కృషిచేస్తాం

ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి

తిరువూరు: రైతుల సంక్షేమానికి అవసరమైన కార్యక్రమాలు చేపడతామని తిరువూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి అన్నారు. తిరువూరు మార్కెట్ కమిటీ పాలకవర్గ పదవీ కాలం పొడిగించిన సందర్భంగా స్థానిక ఏఎంసీ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దీర్ఘకాలంగా ఏఎంసీ ద్వారా చేపట్టాల్సిన అభివృద్ధి పనుల ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి నిధులు సాధిస్తామన్నారు. గ్రామాల్లో పొలాలకు లింకురోడ్ల నిర్మాణం, మినీ గోదాముల నిర్మాణం, కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు తదితర కార్యక్రమాలను అమలు చేస్తామని తెలిపారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ట



విశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన శివలింగం



గోసవీడు ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి

గోసవీడు(గంపలగూడెం) : గంపలగూడెం మండలం గోసవీడులో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ట, నాభిశిల, ధ్వజస్తంబ ప్రతిష్టలను బుధవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు అరిపిరాల అప్పయ్యశాస్త్రి ఆధ్వర్యంలో అర్చక బృందం ప్రత్యేక పూజలు, హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పునర్నిర్మించిన విశ్వేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ, శిఖర ప్రతిష్ట, ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వంజస్తంభ ప్రతిష్ట, నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ, అక్కలమ్మ ఆలయాల్లో అమ్మవార్ల విగ్రహ, బొడ్డురాయి ప్రతిష్టలను వైభవంగా నిర్వహించారు. తిరువూరు ఎమ్మెల్యే కే. రక్షణనిధి అయా ఆలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నదానం కార్యక్రమానికి భక్తులు వేలాదిగా హాజరయ్యారు. ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కోట శామ్యూల్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం



కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు

మైలవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మిషన్ లైఫ్ కాన్సెప్ట్‌లో భాగంగా కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఎన్టీఆర్ డిస్ట్రిక్ట్, విజయవాడ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, నెహ్రూ కేంద్ర వలంటీర్ విద్యార్థులతో బుధవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ భారత్ వలన నేడు నగరంలో ప్రజలు పరిశుభ్రంగా, ఆరోగ్యంగా జీవిస్తున్నారని తెలిపారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ సభ్యులు, ప్రకృతి క్లబ్, ఎన్‌సీసీ వలంటీర్లతో ప్లాస్టిక్ వ్యర్థాలు నిర్మూలన చేయడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా యూత్ ఆఫీసర్ సుంకర రాము, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్స్ డాక్టర్ బీ శివహరిప్రసాద్, ఎస్.ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సినీ నటుడు కృష్ణ జయంతి వేడుకలు



సూపర్‌స్టార్ కృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళాకారులు, అభిమానులు

ముసునూరు: సినీ రంగంలో డేరింగ్ అండ్ డాషింగ్ హీరోగా అభిమానుల హృదయాలలో నిలిచిపోయిన సూపర్‌స్టార్ కృష్ణ సదా స్మరణీయులని మండల పౌరాణిక నాటక కళాకారుల సమాఖ్య అధ్యక్ష, ఉపాధ్యక్షులు కూసం మార్కండేయులు, సత్యనారాయణ పేర్కొన్నారు. చెక్కపల్లి సెంటర్, వాటర్ ట్యాంక్ సెంటర్లలో ఆ సమాఖ్య, కృష్ణ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో సినీ నటశేఖరుడు కృష్ణ జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు, పౌరాణిక నాటక కళాకారులు కృష్ణ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు కళాకారులు, అభిమానులు నాగేశ్వరరావు, నాగరాజు, వసంతరావు, శ్రీనివాస్, రాంబాబు, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, ముసలయ్య పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఏ.కొండూరు: తాగునీటి ఎద్దడి నివారణకు తగు చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని పెద్ద తండా గ్రామంలో బుధవారం జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా జరిగిన పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ తండాలో ఐదు లక్షల వ్యయంతో పైపులైన్లు ఏర్పాటు చేసి, ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. మండలంలోని దీప్లా నగర్‌లో రూ. 6.13 లక్షలు, గొల్లమండల తండాలో రూ. 8.98 లక్షలు, వెస్ట్‌మాధవంలో రూ. 13.13 లక్షలు, ఈస్ట్‌మాధవరంలో రూ. 12 లక్షలు, ఎ.కొండూరు తండాలో రూ. 8 లక్షలతో పనులు ప్రారంభించారని తెలిపారు. ఆయా గ్రామాల్లోని తాగునీటి సౌకర్యం లేని చోట ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్వేత పాల్గొన్నారు.

ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించడమే లక్ష్యం

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



ప్రభుత్వ హైస్కూల్ ప్రహరీగోడ ప్రారంభించిన ఎంపీ కేశినేని శ్రీనివాస్, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

మైలవరం: పార్టీలు వేరైనా ప్రజలకు ప్రజాప్రతినిధులుగా అత్యుత్తమ సేవలు అందించడమే తమ లక్ష్యమని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరం ఎస్వీఆర్జీఎన్నార్ ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో నిర్మించిన ప్రహరీ గోడను ఎంపీ కేశినేని శ్రీనివాస్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. మైలవరం నియోజకవర్గం అభివృద్ధికి నిధులు కేటాయించిన విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని)కి ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృతజ్ఞతలు తెలిపారు. మైలవరం ఎస్వీఆర్జీఎన్నార్ ప్రభుత్వ బాలుర హైస్కూల్‌కు ఎంపీ నిధులు రూ.30లక్షలు మంజూరు చేశారని పేర్కొన్నారు. అదే విధంగా రెడ్డిగూడెం మండలం నాగులూరులో కమిటీ హాల్ నిర్మాణం నిమిత్తం రూ.50లక్షలు, నియోజకవర్గంలో మరో నాలుగు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు రూ.1.05కోట్లు, కొండపల్లిలో బొమ్మల కళాకారుల కోసం భవనాల నిర్మాణాలకు రూ.కోటి మంజూరు చేశారని తెలిపారు. పార్టీలు వేరైనా, సిద్ధాంతాలు వేరైనా పార్టీ విధానాల ప్రకారం తాము నడుచుకుంటామని, నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. కార్యక్రమంలో మైలవరం జమీందారు తనయుడు ఎస్వీ నివృతరావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

ముసునూరు: మండుటెండల్లో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు ఆ శాఖ సిబ్బందికి వైస్ ఎంపీపీ పాముల గంగాధర్ చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. గోపవరం కంసాలి చెరువు, చిన్న చెరువు, కట్టుకాలవ ఫీడర్ చానల్స్‌కు జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. 400 మంది ఉపాధి కూలీలు, మేట్లకు వడదెబ్బ తగలకుండా ఉండేలా చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. ఎండలు తగ్గుముఖం పట్టేవరకు సొంత నిధులతో కూలీలకు చల్లని మజ్జిగను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో సొసైటీ అధ్యక్షుడు కోటగిరి గోపాలకృష్ణ, గ్రామ సర్పంచ్ వాణి, ఉప సర్పంచ్ లక్ష్మయ్య, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు వల్లభనేని గోపి, ఎంపీటీసీ సభ్యులు వెంకమ్మ, ఖాలీషా మస్తాన్ వలి పాల్గొన్నారు.

మైలవరంలో..

మైలవరం: మైలవరం లకిరెడ్డి హనిమిరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ గత 17 రోజులుగా నిరాటంకంగా జరుగుతుంది. దాతలు ఎం. పవన్‌కుమార్, నిరీష, దూపగుంట్ల శివప్రసాదరావు, రామవెంకట గంగాధర కుమారిల సహకారంతో బుధవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎస్. మల్లికార్జునరావు, ఆలమూరి చంద్రం, పుల్లారెడ్డి, గోపాల్, మసనం సుధాకర్ పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులతో దుష్ఫలితాలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): పొగాకు ఉత్పత్తులు వాడటం వలన అనేక వ్యాధులు సంభవిస్తాయని కొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆర్.పద్మావతి అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక పీహెచ్‌సీలో అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పొగాకుతో ఊపిరితిత్తులకు సంబంధించిన టీబీ, క్యాన్సర్ వ్యాధులు వస్తాయన్నారు. గుట్కా, పాన్ పరాగ్‌లవలన గొంతు క్యా న్సర్, నోటి వ్యాధులకు గురవుతారని తెలిపారు. పొగాకు ఉత్పత్తులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పొగాకు ఉత్పత్తుల వాడకం ప్రాణాంతకం

నూజివీడు : పొగతాగడంవల్ల ఊపిరితిత్తులు దెబ్బతినడంతో ఆరోగ్యంపై అనేక దుష్ఫలితాలు సంభవిస్తాయని నూజివీడు ఆర్టీసీ డిపో మేనేజర్ సీహెచ్ పవన్ కుమార్ అన్నారు. నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఆర్టీసీ బస్టాండులో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. డిపో మేనేజర్ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులను వాడటం ప్రాణాంతకమన్నారు. నవజీవన్ బాలభవన్ జోనల్ కోఆర్డినేటర్ బి.రవి మాట్లాడుతూ పొగాకుకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ముసునూరు: పేకాట శిబిరంపై దాడి చేసినట్లు ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపారు. మండలంలోని అక్కిరెడ్డిగూడెంలో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై బుధవారం సాయంత్రం దాడిచేసి, ఇద్దరిని అదుపులోనికి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.1,600 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. వీరిని గురువారం నూజివీడు కోర్టుకు తరలించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆంగ్ల భాషను నేర్చుకోవాలి



ఆంగ్ల భాష ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయిని ములగలేటి ఉమ

నూజివీడు : ప్రపంచంలోని అన్ని భాషలను అనుసంధానం చేసే భాష ఆంగ్లభాష అని, దానిని విద్యార్థులందరూ నేర్చుకోవడం ద్వారా జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని హైస్కూల్ ఇంగ్లిష్ ఉపాధ్యాయిని ములగలేటి ఉమా అన్నారు. పట్టణంలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు ఆంగ్ల భాష ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో కాంపిటేషన్ పరీక్షల్లో రాణించాలన్నా, ఇతర రాష్ట్రాలకు, దేశాలకు వెళ్లి అక్కడ రాణించాలన్నా ఆంగ్ల భాష మాట్లాడటం ఎంతో అవసరమన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు ఈమని శేషయ్య, గ్రంథాలయాధికారి బీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గొల్లపల్లిలో...

మండలంలోని గొల్లపల్లి గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులతో పుస్తకపఠనం చేయించారు. గ్రంథాలయాధికారి డొక్కు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తెలుగుభాషపై పట్టు సాధించాలి

తిరువూరు: మాతృభాషను క్షుణ్ణంగా నేర్చుకోవడానికి విద్యార్థులు కృషి చేయాలని తెలుగు భాషా వికాస సమితి అధ్యక్షుడు తోట ఉమామహేశ్వరరావు సూచించరు. స్థానిక గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో బుధవారం వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా తెలుగు వ్యాకరణంలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఏ భాషలోనైనా పట్టు సాధించాలంటే గ్రామర్ విధిగా నేర్చుకోవాలని ఉమామహేశ్వరరావు తెలిపారు. గ్రంథాలయాధికారి పద్మావతి పర్యవేక్షించారు.

క్షతగాత్రుడికి ఎమ్మెల్యే వసంత పరామర్శ



బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

జూపూడి(ఇబ్రహీంపట్నం): జూపూడి ఖిల్లా రోడ్డులో గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న గద్దల కోటేశ్వరరావును ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ గొల్లపూడి ఆంధ్రా వైద్యశాలలో బుధవారం పరామర్శించారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని సూచించారు.

విద్యుత్ కార్యాలయం ప్రారంభం

విస్సన్నపేట: స్థానిక విద్యుత్ శాఖ నూతన కార్యాలయాన్ని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, విస్సన్నపేట, తిరువూరు జెడ్పీటీసీ సభ్యులు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, రామచంద్రారెడ్డి, కేడీసీసీబీ డైరెక్టర్ రాణి, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, విద్యుతుశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కృష్ణనాయక్, ఏడీఈ నారాయణ, ఏఈ విజయభాస్కర్ పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్చుకోవాలి

తిరువూరు: తమ భావాలను వ్యక్తం చేసేటపుడు మృదువుగా సంభాషించడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘ కన్వీనర్ రాంప్రదీప్ తెలిపారు. స్థానిక నాగార్జున స్కూలులో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి ప్రత్యేక స్పోకెన్ ఇంగ్లిష్ తరగతుల్లో బుధవారం విద్యార్థులకు ఆయన పలు సూచనలిచ్చారు. స్నేహితులతో, పెద్దలతో, తల్లిదండ్రులతో సంభాషించేటప్పుడు సందర్భానుసారం పదాలు ఉపయోగించాలన్నారు.

నేడు, రేపు గడప గడపకు మన ప్రభుత్వం

గంపలగూడెం: గంపలగూడెం సచివాలయం-1 పరిధిలో గురు, శుక్రవారాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తారని పేర్కొన్నారు. మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

డ్రోన్ సర్వే ప్రారంభం

తిరువూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో జగనన్న శాశ్వత భూహక్కు సర్వే కింద డ్రోన్‌సర్వేను బుధవారం ప్రారంభించారు. లక్ష్మీపురం, కోకిలంపాడు గ్రామాల్లో తహసీల్దారు సురేష్‌బాబు ఆధ్వర్యంలో సర్వేయర్లు భూసర్వేను నిర్వహించారు. ఈ సర్వే ప్రక్రియ పూర్తయిన తరువాత రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను, ఇళ్లు, ఇళ్ల స్థలాలకు ఆస్తి ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తామని తహసీల్దారు తెలిపారు.

పేదల హృదయాల్లో సీఎం జగన్‌కు సుస్థిర స్థానం



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

మైలవరం: దేశంలో ఏ రాష్ట్రంలో జరగని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ఒక వైపు అభివృద్ధి, మరో వైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదల హృదయాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిర స్థానం పొందారని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా మైలవరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యే వసంత కేక్ కట్ చేశారు. వలంటీర్, గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా అవినీతి లేని పారదర్శక పాలనకు శ్రీకారం చుట్టి, పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్న ఆదర్శమూర్తి సీఎం జగనన్న అని కొనియాడారు. సీఎం జగన్ సంక్షేమ పాలనలో ఇచ్చిన హామీలన్నీ నేరవేర్చారన్నారు. పాలనా సౌలభ్యతకు జిల్లాల పునర్విభజన చేసి, నూతన సంస్కరణలు అమలు చేసిన దార్శినికుడు జగన్ అన్నారు. కోవిడ్ కష్ట సమయంలో కూడా సంక్షేమ పథకాలను సమర్ధవంతంగా అమలు చేశారన్నారు. ఇదే సంక్షేమం, అభివృద్ధి భవిష్యత్‌లో కొనసాగేందుకు అందరూ జగనన్నకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

గొల్లపూడి(భవానీపురం): తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కృషి చేసి, ప్రజల దాహార్తిని తీర్చినట్లు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తెలిపారు. గొల్లపూడి సాయిపురం కాలనీలో రూ.7.30కోట్లతో నిర్మించనున్న తాగునీటి సరఫరా పథకం (ఫిల్టర్‌బెడ్ల) నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆయన మాట్లాడుతూ గొల్లపూడి కృష్ణానది నుంచి తాగునీటిని మళ్లించి ఫ్లోరైడ్ లేని రక్షిత తాగునీరు అందించడమే పథకం లక్ష్యం అన్నారు. రానున్న ఏడు నెలల్లో పథకం పూర్తి చేసి ఉత్తరం వైపు ప్రాంతానికి తాగునీరు అందిస్తామన్నారు. దక్షిణం వైపు గ్రామానికి ఇప్పటికే స్వచ్ఛమైన తాగునీరు అందుతుందన్నారు. దేవినేని ఉమా పదేళ్ల పాటు అధికారంలో ఉండి 2019 ఎన్నికల నోటిఫికేషన్‌కు 15 రోజల ముందు తాగునీటి పథకానికి శంకుస్థాపన చేయడంపై ఎమ్మెల్యే విమర్శించారు. ఎన్నికల ముందు శంకుస్థాపన చేయడానికి నీకు సిగ్గు ఉందా అని ప్రశ్నించారు. ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సువర్ణరాజు, ఏఎంసీ చైర్మన్ కారంపూడి సురేష్, పార్టీ గ్రామ కన్వీనర్ జి.సురేష్, వైస్ ఎంపీపీ వేమూరి సురేష్ పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే రక్షణనిధి



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

కలగర (విస్సన్నపేట): సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఇంటివద్దకే వెళ్లి అందించడం వలన వృద్ధులకు, దివ్యాంగులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. మండలంలోని కలగర సచివాలయం పరిధిలో లక్ష్మీపురం, కలగర గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తూ అబ్ధిదారులకు బ్రోచర్ అందజేశారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. గతంలో పింఛన్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. నేడు ఒకటో తారీఖున వలంటీర్లు లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు అందిస్తున్నారన్నారు. పేదవాడి సొంతింటి కల నేరవేర్చేందుకు పేదలకు నివేశన స్థలాలు పంపిణీ చేసిన ఘనత వైఎస్సార్ సీపీదే అన్నారు. త్వరలో కాలనీ ఇళ్ల మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా సుపరిపాలన అందించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, జెడ్పీటీసీ సభ్యుడు లోకేశ్వరరెడ్డి, గ్రామ సర్పంచ్ రమ, ఎంపీటీసీ సభ్యురాలు పుల్లమ్మ, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి ఎంపీడీఓ వెంకటరమణ పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ త్రివేణీదుర్గ

నూజివీడు: పట్టణ అభివృద్ధికి పాలక, ప్రతిపక్ష సభ్యులందరూ సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా త్రివేణీదుర్గ మాట్లాడుతూ పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం టీడీపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. పట్టణంలోని పోతురెడ్డిపల్లి రోడ్డులో నాచిన చెరువు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో కొన్ని యూనియన్లు షెడ్డులు వేయడంపై దుర్గాప్రసాద్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనికి పగడాల సత్యనారాయణ మాట్లాడుతూ రెవెన్యూ, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులతో చర్చించిన మీదటే ఎవరూ అభ్యంతరం పెట్టనందునే కొన్ని యూనియన్లకు తాత్కాలిక పద్ధతిపై షెడ్డులు నిర్మించుకునేందుకు అనుమతి ఇచ్చినట్లు పేర్కొన్నారు.

రిజిస్ట్రేషన్ల నిలుపుదల చేయడంపై అభ్యంతరం

పట్టణంలోని సర్వే నెంబరు 450/1లో భూముల రిజిస్ట్రేషన్లను దాదాపు పదేళ్లుగా నిలుపుదల చేయడంపై మున్సిపల్ వైస్ చైర్మన్ సత్యనారాయణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ముస్లింల శ్మశానం విషయంలో వక్ఫ్ బోర్డు అభ్యంతరం తెలపడంతో దానికి సంబంధించి స్థల వివాదాన్ని రెవెన్యూ అధికారులు పరిష్కరించకుండా 450/1లోని సర్వే నంబర్‌లోని దాదాపు 500 ఎకరాల భూముల రిజిస్ట్రేషన్లను నిలపడం దుర్మార్గమని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, డీఈ దాస్యం లక్ష్మీనారాయణ, టీపీఓ చిన్న వెంకయ్య పాల్గొన్నారు.